క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుండ్రాంపల్లి, ఏపూరు గ్రామాల్లో బుధవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చిట్యాల ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుండ్రాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

నకిరేకల్ : కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన పసాల కరుణాకర్ కూమారుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో కరుణాకర్ చికిత్స నిమిత్తం రూ.1.10లక్షలు అవసరం కాగా స్పందించిన ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం స్థానికంగా బాధితుడికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు.

విద్యుత్ మోటార్ చోరీ

మర్రిగూడ : విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేసి పొలం వద్ద ఉంచగా గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు గుమ్మకొండ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండూరుకు వెళ్లే రహదారి సమీపంలో దోర్నాలబావి వద్ద తమ ఓ వ్యవసాయ పొలంలో మోటార్‌కు సోమవారం మరమ్మతులు చేసి ఉంచారు. మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి కనిపించకపోవడంతో చోరీ గురైనట్లు గుర్తించారు. వెంటనే బాధిత రైతు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మోటార్ విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని వాపోయాడు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన గోపీచంద్‌కు బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో అతడి వైద్యానికి లక్షలు ఖర్చువుతాయని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆపద్బాంధవ్ ఫౌండేషన్ సభ్యుడు పంజాల శశికుమార్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్ ద్వారా జమచేసిన రూ.31,250 నగదును గోపిచంద్ తల్లిదండ్రులకు మంగళవారం అందజేశారు. ఆయన వెంట గణేష్, జక్కల స్వప్న, బాజా అరుణ్, దూదిమెట్ల సాయి, రామన్నపేట శ్రీకాంత్, షేక్ యూసఫ్, కొంగల సైదులు, రాజీవ్‌సహకార బ్యాంక్ మేనేజర్ రవీందర్, బబ్లూ, రాజు తదితరులు ఉన్నారు.

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం

శాలిగౌరారం : మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు చామల వెంకటరమణారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఎంపీగా గెలుపొందడంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు లోడంగి మహేశ్ ఉన్నారు.

10జీపీఏ సాధించిన విద్యార్థినికి సన్మానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇరాపురి అక్షర పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10 జీపీఏ సాధించడంతో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో విద్యార్థినిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరయ్యారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10/10 సాధించినందుకు అక్షరను, పాఠశాల అధాపక బృంధాన్ని ప్రత్యేకంగా అభినందించారని పాఠశాల హెచ్‌ఎం ఎస్. విజయకుమారీ తెలిపారు. ఈ సందర్భంగా అక్షరను జిల్లా విద్యాధికారి భిక్షపతి, మండల విద్యాశాఖాధికారి బాలాజీ నాయక్‌లు పాఠశాల బృందాన్ని ప్రశంసించారు.

ఫొటోగ్రాఫర్ల నిరసన

చౌటుప్పల్ : సంస్థాన్ నారాయణపురంలో ఫొటోగ్రాఫర్ లింగస్వామిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు తొర్పునూరి సాయిలు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఫొటోగ్రాఫర్లు నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెట్టు రామచంద్రారెడ్డి, విశ్వనాథుల చంద్రశేఖర్, చింతల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బి.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాలకు 9441237136 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదల ఇళ్ల స్థలాలు ఆక్రమణ !

- 30 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం
- హద్దులు చూపించకపోవడంతో ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులు
- భూమి పక్కనే ఉన్న రైతు ఆక్రమిస్తున్నాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు



సేద్యం చేసిన భూమి

చండూరు : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల భూమి ఆక్రమణకు గురవుతోంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన 7 ఎకరాల 12 గుంటల భూమిని సంబంధిత అధికారులు పేదలకు పట్టాలు ఇచ్చారే కాని పొజిషన్ చూయించలేదు. పేదలకు ఇచ్చిన భూమి పక్కనే ఉన్న కొంత భూమిని ఇటీవల ఓ రైతు సేద్యం చేసుకోవడానికి సిద్ధం కావడంతో లబ్ధిదారులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి సర్వే నంబర్, రైతుకు సంబంధించిన సర్వే నంబర్ ఒక్కటే కావడంతో ఇళ్ల స్థలాలు ఇచ్చింది ఇక్కడ కాదంటూ రైతు వాదిస్తున్నాడు.

కనిపించని ఒప్పంద పత్రం

రోడ్డు వైపు ఇళ్ల స్థలాల భూమి తనదేనని గతంలో ఇదే రైతు సేద్యం చేసుకోవడంతో ఆనాటి తహసీల్దారు లావణ్య విచారణ చేశారు. అనంతరం తాను ఇక నుంచి లబ్ధిదారులకు చెందిన భూమిలోకి రాను అని ఆ రైతు నుంచి ఒప్పంద పత్రం రాయించుకున్నారు. ఇక సమస్య పరిష్కారం అయ్యిందని లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ తిరిగి అదే రైతు ప్రస్తుతం ఆ భూమిని సేద్యం చేసుకోవడంతో సమస్య మొదటికి వచ్చింది. ఆనాడు రాయించుకున్న ఒప్పంద పత్రం కనిపించడం లేదని అధికారులు చెప్తున్నారు. ఆ పత్రం మాయం కావడంపై లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

7 ఎకరాల 20 గుంటలు కొనుగోలు

తేరట్‌పల్లి గ్రామంలో (నామాపురం గ్రామం దారిలో) 1993వ సంవత్సరంలో సర్వే నంబర్ 377, 378 లో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసేందుకు 7 ఎకరాల 12 గుంటల భూమిని కొనుగోలు చేసింది. ఆనాడే సుమారు 150 పైగా ప్లాట్లు చేసి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కానీ లబ్ధిదారులకు మాత్రం పొజిషన్ చూపించలేదు.

పొజిషన్ చూపించలేదు



30 ఏళ్ల కింద ఇళ్ల పట్టాలు అందించారు. కానీ పొజిషన్ చూపించలేదు. ఆనాటి నుంచి నేటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ఉప ఎన్నికల ముందు చూపిస్తా అన్నారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. మాకు ప్లాట్లు చూపిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం.

– సింగం శేఖర్, తేరట్‌పల్లి, లబ్ధిదారుడు

హద్దులు చూపించాలి



ప్రభుత్వం పంపిణీ చేసిన భూమికి హద్దులు చూపించి ప్లాట్లు చేయాలి. హద్దులు లేకపోవడంతో కొంత భూమిని ఓ రైతు ఆక్రమించుకుంటున్నాడు. ఇప్పటికే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం. అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– బరిగెల లింగయ్య, తేరట్‌పల్లి

నోటీసులు అందజేశాం

సర్వే నంబర్‌లోని రైతుల, ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్నాం. ఇప్పటికే సంబంధిత రైతులకు నోటీసులు అందించాం. రైతు భూమిని ఆక్రమించుకుంటున్నాడని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

– రాములు, గట్టుప్పల్, తహసీల్దారు

విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఈనెల 25, 26తేదీల్లో నిర్వహించే కేవీపీఎస్ విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఆయన తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. అట్టడుగున ఉన్న నిమ్నజాతులు సమగ్ర అభివృద్ధి చెందాలంటే సమాజంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గాదె నర్సింహ, బొల్లు రవీందర్, పుచ్చకాయల నర్సిరెడ్డి, కట్ట శ్రవణ్‌కుమార్, శివ, శ్రీనివాస్, సైదులు, మోహన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ, నీట్‌లో ‘ఏకలవ్య’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఏకలవ్య పాఠశాల 2022 బ్యాచ్ విద్యార్థులు నీట్, జేఈఈ 2024 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. నీట్ ఫలితాల్లో వి.ధరణి 608, ఆర్.సిరిచందన 561, ఆర్.రష్మిత 520మార్కులు సాధించారన్నారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పి.సాయిచరణ్‌రెడ్డి 1593, జి.సిరి సహస్ర 4644, ఆర్.సంజయ్ 5942 ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబచిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

పెర్కకొండారం పాఠశాలకు శ్రేష్ట ప్రతిభా పురస్కారం



హెచ్‌ఎం సైదులుకు పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రేష్ట పురస్కారాన్ని అందజేశారు. పదోతరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు, పాఠశాలలకు మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉత్తమ పురస్కారాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై 10జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, మెడల్స్ అందజేశారు. అందులో భాగంగానే మండలం నుంచి పెర్కకొండారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాయిగణేశ్, ప్రవళిక విద్యార్థులు 10జీపీఏ సాధించడంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పాటూ హెచ్‌ఎం సైదులును సత్కరించారు. అనంతరం పాఠశాలకు శ్రేష్ట పాఠశాల ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కొండమల్లేపల్లి : పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తున్న ఎస్‌పీఆర్ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలను నడిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాల ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వలమల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, రమావత్ లక్ష్మణ్, వెంకటేష్, అఖిల్, ఆకాష్, బాబురాం, రాజు, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు యలమల గోపిచంద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా సిలబస్ అమలు చేయడం, విద్యాహక్కు చట్టం అవుతుందన్నారు. రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ రూపొందించిన సిలబస్ కాకుండా సొంత సిలబస్ వాడటం చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు. అంతే గాకుండా పలు ప్రైవేటు పాఠశాలల్లో కనీస అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదమరిస్తే అంతే సంగతి !

మర్రిగూడ : మండల వ్యాప్తంగా సోమవారం కురిసిన వర్షంతో మండలంలోని లెంకలపల్లి గ్రామసమీపంలో గల రహదారి దిగువ భాగంలో ఉన్న గూనలపై గల మట్టి వరద తాకిడికి కొట్టుకుపోయింది. దీంతో కొంతమేరకు రహదారి చివరలో ఉన్న రోడ్డు దెబ్బతింది. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఆదమరిచి కాస్తా రోడ్డు పక్కకు ఆపాలనుకున్నా ఇకా అంతే సంగతులు. ప్రమాదం పొంచి ఉందని దెబ్బతిన్న ప్రాంతంలో అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లెంకలపల్లి వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న రహదారి

గ్రామీణ వైద్యులపై దాడులు సరికాదు

చండూరు : గ్రామీణ వైద్యులపై ప్రభుత్వ అధికారుల దాడులు సరికాదనిబీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మాదగోని నాగార్జున అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోతున్న వానాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దని ఐఎంఏ డాక్టర్లను ఆయన కోరారు. పల్లెల్లో గ్రామీణ వైద్యం అత్యవసరమన్నారు. తక్కువ ఖర్చులో గ్రామీణులకు అందుబాటులో ఉంటున్న గ్రామీణ వైద్యులపై మీ పెత్తనం సరికాదని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, రమేష్‌కుమార్, రవి, ద్రోణాచారి తదితరులు ఉన్నారు.

చండూరులో బడిబాట



బంగారిగడ్డలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చండూరు: చండూరు, గట్టుప్పల్ మండలాల్లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా బంగారిగడ్డ జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చిక్కుళ్ల రామలింగయ్య, పారిజాతా దేవి, ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, గౌతమి, ఎలిజబెత్, ఖైరుద్దీన్, యూన్సీ, గ్రామ కార్యదర్శి కోటి, అంగన్‌వాడీటీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్రల పీఆర్‌సీ బకాయిల విడుదలపై హర్షం

వేములపల్లి : పశుగణాభివృద్ధి శాఖలో గోపాల మిత్రలుగా పనిచేస్తున్న 1,530 మందికి సుమారు రూ.7.36కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయడం హర్షణీయమని గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గోపాలమిత్రలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం వంద రోజుల్లో పీఆర్‌సీ బకాయిలను విడుదల చేసిందన్నారు. బకాయిల విడుదలకు సహకరించిన మంత్రులు భట్టి విక్రమార్కకు, జిల్లా మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు, గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేముల వీరేశంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



డ్రైయినేజీ కాల్వపై పగిలిన స్లాబు బండలు

కేతేపల్లి : మండల కేంద్రంలోని జాతీయ రహదారికి పక్కన నిర్మించిన డ్రెయినేజీ స్లాబు పగిలి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నాలుగు లేన్లు విస్తరణ సమయంలో కేతేపల్లిలో సర్వీసు రోడ్డుకు జాతీయ రహదారికి మధ్యలో గ్రామం ఒక చివర నుంచి మరో చివర వరకు డ్రెయినేజీ కాలువలను నిర్మించారు. ఈ డ్రెయినేజీ కాల్వపై సిమెంట్, కంకర మిశ్రమంతో స్లాబు వేశారు. ఇదిలా ఉండగా స్థానిక బస్‌స్టేజీ సమీపంలో హైవే నుంచి సర్వీసురోడ్డు మీదకు రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, ఆటోల వంటి వాహనాలు డ్రెయినేజీ కాల్వపై నుంచి వెళ్తుండడంతో స్లాబు పగిలి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రి వేళలో కనిపించక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జీఎమ్మార్ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే శాశ్వతంగా ఉండే విధంగా పనులు చేపట్టాలని, అదే విధంగా ఇక్కడ నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మేలైన పత్తి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

రామగిరి(నల్లగొండ) : పత్తి సాగులో మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తిప్పర్తి మండల వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో నల్లగొండ, తిప్పర్తి, కనగల్ రైతులకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సాంద్రత పత్తి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సేంద్రియ వ్యవసాయంపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తిప్పర్తి మండల వ్యవసాయ అధికారి సన్నీరాజ్, ఏఈఓ సంతోషి, లక్ష్మీనారాయణ, రజిత, గోపి, కనగల్, నల్లగొండ మండలాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని వినతి



జేసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీ కులాల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ సంఘాలు, బీఎల్‌ఎఫ్, పీఆర్‌పీఎస్, ఎంసీపీఐ నాయకులు మంగళవారం స్థానికంగా జేసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు పెన్షనర్ల భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు బీసీ కులగణన వెంటనే చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.పర్వతాలు, నూనె వెంకటస్వామి, మట్టయ్య, జనార్దన్‌గౌడ్, వంటిపాక యాదగిరి, చొల్లేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క జన్మదిన పాటల సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి విక్రమార్క

మర్రిగూడ : మండలానికి చెందిన పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చల్లం పాండురంగారావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా పాడిన పాటల సీడీని మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో విక్రమార్క ఆవిష్కరించారు. ఈనెల 15న భట్టి జన్మదినం సందర్భంగా పాట పాడినట్లు, ఆ సీడీని ఆయనే ఆవిష్కరించడం ఆనందంగా ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

విత్తన ధరల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలి



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగమణి

మిర్యాలగూడ : ఫర్టిలైజర్ దుకాణాదారులు తమ షాపు ఎదుట విత్తన ధరల వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని ఏడీఏ నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆమె సీడీలు, ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, నాసిరకం విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సరిత తదితరులు ఉన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ మండలంతో పాటు అడవిదేవుపల్లి మండలాలకు చెందిన 41మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పేదలను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, తహసీల్దార్లు హరిబాబు, సురేష్‌కుమార్, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మంద సైదులు, గున్‌రెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాలకవర్గం ఏర్పాటు ఎప్పుడో..

- రద్దయిన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ
- నెలలు గడుస్తున్నా పాలకవర్గం ఏర్పాటులో జాప్యం



చిట్యాలలోని ఏఎంసీ కార్యాలయం

చిట్యాల : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దుఅయ్యింది. పాలకవర్గం పదవీకాలం పూర్తయి నెలలు గడుస్తున్నా తిరిగి ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుంది. దీంతో రైతులు సమస్యలు పరిష్కారంకాక ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తమ సమస్యలను విన్నవించేందుకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులను ఆశ్రయిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఏడాదికి రెండు నుంచి నాలుగు కోట్ల ఆదాయంతో గ్రేడ్–2 కేటగిరిలో ఉంది.

చైర్మన్ పీఠంపై పలువురి ఆశలు..

చిట్యాల మున్సిపాలిటీతో పాటుగా మండలంలో మరో 07గ్రామపంచాయతీలతో పాటు నార్కట్‌పల్లి మండలంలోని 29 గ్రామ పంచాయతీలను కలుపుకుని చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు అయ్యింది. ఈ మార్కెట్ ద్వారా రైతులకు పలు సేవా కార్యక్రమాలు అందాల్సి ఉంది. కాని గత కొన్ని నెలల క్రితం పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. తరువాత రాష్ట్రంలో పలు ఎన్నికల నిర్వహణతో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తిరిగి మరల నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఈనెల 5తో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అవకాశాలు దక్కని పలువురు నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు వస్తాయనే ఆశలు మొదలయ్యాయి. గత రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ పాలకవర్గ చైర్మన్, డైరెక్టర్‌ల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్ కేటాయింపుతో పాలకవర్గాలను నామినేటెడ్ చేసింది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రస్తుతం రిజర్వేషన్‌లకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడంతో గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రయత్నం చేసిన పలువురు నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటుగా కోమటిరెడ్డి బ్రదర్స్ ద్వారా చైర్మన్ పదవిని దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కాగా 20ఏళ్లుగా చిట్యాల మార్కెట్ పాలకవర్గ చైర్మన్ పదవీ చిట్యాల మండల వాసులే దక్కించుకుంటూవస్తున్నారు. ఇప్పటికైనా వానాకాలం వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చేలోపైనా చైర్మన్, పాలకమండలి సభ్యులను నియమించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

పాలకవర్గం ఏర్పాటుపై ఆదేశాలు రాలేదు

చిట్యాల ఏఎంసీ పాలకవర్గం నియామకంపై, అదే విధంగా మార్కెట్ పాలకవర్గ చైర్మన్, డైరెక్టర్‌లకు రిజర్వేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పాలకవర్గం నియామక ప్రక్రియను ప్రారంభిస్తాం.

– ఆర్.జానయ్య, ఏఎంసీ కార్యదర్శి, చిట్యాల